క్లుప్తంగా

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఎన్పీకుంట: ఎన్.పీ.కుంట-2 సచివాలయం పరిధిలోని చినసానివారిపల్లి, రెడ్డివారిపల్లి, చీమలచెరువుపల్లితో పాటు మండల కేంద్రం లోని పెడబల్లి బజారులో ఈనెల 3వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం

తనకల్లు: స్థానిక ఈతోడు రోడ్డులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గుడి నిర్మాణానికి విరాళం

నల్లమాడ: మండలంలోని సోమగుట్టపల్లిలో రామాలయం నిర్మాణానికి పింఛన్‌దారులు రూ.1.35 లక్షలు విరాళంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా మండల కన్వీనర్, గ్రామైఖ్య సంఘం లీడర్ చిన్నాదేవి ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు మొత్తం 42 మంది స్వచ్ఛందంగా గుడి నిర్మాణానికి విరాళాలు అందజేశారు. గ్రామంలో 60 కుటుంబాలు ఉండగా.. 200 పైబడి జనాభా ఉంది. గ్రామంలో ఇప్పటి వరకూ గుడి లేకపోవడంతో గుడి నిర్మించాలనే తలంపుతో పింఛన్‌దారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి సమీపంలో నూతన సంవత్సరం సందర్భంగా శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి.

స్ప్రింక్లర్ పైపుల చోరీ

ధర్మవరం అర్బన్: మండలంలోని తుమ్మల గ్రామానికి చెందిన రైతు గొర్ల నారాయణ రెడ్డి పొలంలోని 35 స్ప్రింక్లర్ పైపులను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై స్థానిక రూరల్ పోలీసులకు బాధితుడు గొర్ల నారాయణరెడ్డి ఆదివారం ఫిర్యాదు చేశారు.

పాత బాలాజీ విద్యార్థుల ప్రతిభ

నల్లమాడ: అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పలు క్రీడలకు సంబంధించి బాలికల విభాగంలో కావ్య, నందిని, గాయిత్రి, బ్రహ్మిణి, చంద్రిక, బాలుర విభాగంలో నందికిశోర్, వరుణ్, అభిరామ్, భరత్, జశ్వంత్‌యాదవ్, శివప్రసాద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పోలే వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ పోలే స్వర్ణలత తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్ఐ వలీబాషా అభినందనలు తెలిపారు.

ధర్మవరం చేరుకున్న కేతిరెడ్డి అభిమాని పాదయాత్ర



శేఖర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: గుడ్ మార్నింగ్ ధర్మవరంతో ప్రజలతో మమేకమవుతూ సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విధానాలకు ఆకర్షితుడై విజయనగరం జిల్లా రాజోల్ నుంచి ధర్మవరానికి పాదయాత్ర చేపట్టిన కేతిరెడ్డి అభిమాని వందాడ శేఖర్ ఆదివారం ధర్మవరం చేరుకున్నాడు. 22 రోజుల పాటు 850 కిలోమీటర్లు నడిచిన అతడికి మున్సిపల్ వైస్ చైర్మన్ నాగరాజు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి శేఖర్‌ను ఆప్యాయంగా పలకరించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేతిరెడ్డి కృషి రాష్ట్రం అంతా తెలియాలన్న సంకల్పంతో పాదయాత్ర చేపట్టినట్లు శేఖర్ తెలిపాడు. భవన నిర్మాణ రంగంలో చిన్నపాటి మేస్త్రీగా జీవనం సాగిస్తున్న తాను రాజోల్ నుంచి ధర్మవరానికి సొంత ఖర్చులతో పాదయాత్ర చేపట్టానన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- పండుగలా పింఛన్ల పంపిణీ



పింఛన్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



పుట్టపర్తి టౌన్: పింఛన్ సొమ్ము అందజేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకను ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకొంటే పార్టీ నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. కొన్ని చోట్ల ముడుపులు కూడా చెల్లించాల్సి వచ్చేదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్ సొమ్మును పెంచారని గుర్తు చేశారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచంచారు. ప్రజలు జగన్ అండగా ఉంటూ.. 2024 ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు కేశవ్వ, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, రఫీ, ఎస్టీడీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే పింఛన్ అందేదన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పింఛన్ మొత్తాన్ని రూ.2,250లకు పెంచడమే కాకుండా 64 లక్షల మందికి పింఛన్ కానుక అందజేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు, వారి దుష్ట చతుష్టయం ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు చెప్పే మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2,250లతో పింఛన్ పంపిణీని ప్రారంభించి, ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ఈ ఏడాది లబ్ధిదారులకు రూ.2,750 అందజేయడం జరుగుతోందన్నారు. జగనన్న కాలనీలో 3 వేల మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు అందజేశామన్నారు. జగన్ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎంఎస్ ఫయాజ్, ఖాశీం, రాంప్రసాద్, ఆవులస్వామి, అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్, కొలిమి జిలాన్, దాదాపీర్, రవి, ఇలాహీ, షాను, అమీర్ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రభుత్వం పెంచిన రూ.2,750 సామాజిక పింఛన్ నగదును సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి నూతనంగా 209 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిని ఈనెల 3వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించనున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 4,120 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.1,05,01,500 సొమ్ము మంజూరైనట్లు ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు సంయుక్తంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కన్వీనర్లు సోమశేఖరరెడ్డి, లోకేశ్వర రెడ్డి, వలంటీర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలో వలంటీర్లు తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు 6,286 ఉన్నాయి. 4,518 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. రాత్రికి 90 శాతంపైగా లబ్ధిదారులకు సాయం అందించడం గమనార్హం.

ధర్మవరం: నూతన సంవత్సరంలో సామాజిక పింఛన్ సొమ్మును రూ.2,500 నుంచి రూ. 2,750 పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక 10వ వార్డులో ఆదివారం తెల్లవారుజాము నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు తదితరులు పింఛన్ లబ్ధిదారులతో కలిసి కేక్ కట్ చేశారు. పెంచిన పింఛన్ నగదును అవ్వాతాతలకు అందజేశారు.

ఓడీ చెరువు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ప్రతి పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామ వలంటీర్లతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండల కేంద్రంలో ఎంపీపీ ఫర్వీన్ బాను, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పింఛన్‌దారులకు నగదు అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఈ ఏడాది జనవరి నుంచి పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచు గోవిందు, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

తలుపుల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పింఛన్ల పంపిణీని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పండగలా నిర్వహించారు. మండలానికి కొత్తగా 283 పింఛన్లు మంజూరయ్యాయి.

నల్లమాడ: ప్రభుత్వం పింఛన్ సొమ్మును పెంచడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్త చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు, వలంటీర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 6,500 పైబడి పింఛన్లు ఉండగా తొలిరోజు దాదాపు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి: మండలంలో పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసన కోట, మాదాపురం, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి తొమ్మిది పంచాయతీలుండగా, 2023 నూతన సంవత్సరానికి సంబంధించి 169 కొత్తపింఛన్లు మంజూరయ్యాయి. మొత్తం 5,055 ఉన్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం సచివాలయ సమన్వయకర్తల ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లు చేశారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలోని 36 సమన్వయకర్తలు పింఛన్‌దారుల వద్దకు వెళ్లి పింఛన్ల పెంపుపై ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.250 చొప్పున రూ.2,750కు పెంచారన్నారు. పేదల సంక్షేమం కోసం చేస్తున్న సీఎం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తున్నామని కనగానపల్లి, తూంచర్ల, తగరకుంట సమన్వయకర్తలు తెలిపారు. మండలవ్యాప్తంగా ప్రస్తుతం 6,250 మంది పింఛన్‌దారులకు పింఛన్ పెంచినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పార్టీ నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి 2023 నూతనంగా ముద్రించిన క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్యాలెండర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లోని పథకాలను ముద్రించడం జరిగిందన్నారు. ఇంటింటికీ క్యాలెండర్లను పంచడం వల్ల నవరత్నాలు ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాగిరెడ్డి, రామిరెడ్డి, భాస్కర, సూర్యాగౌడ్, కడప రాజా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



ఓడీ చెరువు: మండలంలోని జెరికుంటపల్లి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. రామాలయంలో అయ్యప్ప మాలధారులు గణపతి, అయప్ప స్వామికి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప ప్రతిమను పల్లకీలో కొలువుదీర్చి, ఊరేగించారు. భక్తులు స్వామికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గురుస్వామి పచ్చార్ల ఆంజనేయులు నాయుడు పాల్గొన్నారు.

నేడు వైకుంఠ ఏకాదశి



కొత్తచెరువు: భక్తుల కోసం ఉత్తర ద్వారాన్ని సిద్ధం చేసిన దృశ్యం

బత్తలపల్లి: ఏడాదికి ఒకసారి వచ్చే ముక్కోటి వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని పురాతన దేవాలయం దంపెట్ల మధురాపురి చెన్నకేశవాలయం, ముష్టూరు శివాలయం, బత్తులపల్లి లక్ష్మీవెంకటేశ్వరాలయాలతో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాలను సిద్ధం చేశారు.

కొత్తచెరువు: మండల పరిధిలోని చెన్నకేశవపురంలో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆలయాల ముస్తాబు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆలయాలు సోమవారం జరిగే ముక్కోటి ఏకాదశికి ముస్తాబయ్యాయి. నూతన సంవత్సర వేడుకలతోపాటు ముక్కోటి ఏకాదశిని పురష్కరించుకుని ఆదివారం శ్రీనివాస నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి, కొత్తపేట వేంకటేశ్వర స్వామి, శ్రీనివాసనగర్ వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. భక్తులకు తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారం ద్వారా స్వాముల దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముదిగుబ్బ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని గణేష హరహర దేవాలయంలో వెంకటేశ్వరస్వామి దర్శనంతో పాటు భక్తులకు ఉత్తర ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్లు అర్చకులు రఘునాథ శాస్త్రి, భరత్‌కుమార్ తెలిపారు. ఉదయం 3 గంటల నుంచే ఉత్తర ద్వార ప్రవేశంతో పాటు శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



వెంకటేశ్‌కు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

ఎన్పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని వంకమద్ది క్రాస్ సమీపంలోని ఓ కల్వర్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బందారుచెట్లపల్లికి చెందిన వెంకటేశ్ తెల్లవారుజామున మండల కేంద్రానికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో కల్వర్టులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సాంబశివ, పైలట్ లోకేశ్వర తెలిపారు.

తనకల్లులో..

తనకల్లు: స్థానిక సాయిబాబా గుడి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఈతోడుకు చెందిన పతి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పతి వ్యక్తిగత పని మీద కొక్కంటి క్రాస్‌కు వెళ్తుండగా.. ఒక్కసారిగా బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన ముఖం, చేతులకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స కోసం తనకల్లు 30 పడకల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భక్తులతో ఆలయాల కిటకిట



పూజలందుకుంటున్న పోట్లమర్రి ఆంజనేయస్వామి

బత్తలపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడు, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో శుభాలు కలగాలని భక్తులు పూజలు చేశారు. పోట్లమర్రి ఆంజనేయస్వామి, శివాలయం, ముష్టూరు శివాలయం, ఆంజనేయస్వామి, గంటాపురం అప్పస్వామి, కాటికోటేశ్వరుడి క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, జ్వాలాపురం లక్ష్మీ నరసింహ దేవాలయం, రామాపురం, మాల్యవంతం వీరనారాయణస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో తెల్లవారుజామున 4 గంటలకే అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

న్యూ ఇయర్ సందడి



ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్/కదిరి అర్బన్/నల్లచెరువు/ధర్మవరం/బత్తలపల్లి/కదిరి అర్బన్/ముదిగుబ్బ/కదిరి/కొత్తచెరువు/పుట్టపర్తి అర్బన్/కదిరి టౌన్: నూతన సంవత్సరమంటే ప్రతి ఒక్కరికీ పర్వదినమే. జనవరి ఫస్ట్ అనగానే పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు ఇలా అందరూ ఆనందంగా గడపాలనుకుంటారు. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి నుండే ప్రారంభమైన న్యూ ఇయర్ వేడుకలు ఆదివారం జనవరి 1న రోజంతా అందరూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ హ్యాపీ హ్యాపీగా గడిపారు.

పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం 2023 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దుకుంట ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, జిల్లా అధికారులతో కలిసి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేకు శాలువాలు, బొకేలు, పూల మాలలు, మొక్కలు, నోటు పుస్తకాలు, మిఠాయిలు అందజేశారు. అలాగే సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు ఆర్‌జే రత్నాకర్‌కు పట్టణ ప్రముఖులు, సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, అధికారులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కుల సంఘాల నాయకులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుడా చైర్మన్ లక్ష్మీనరమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళతి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు రమణారెడ్డి, గాయిత్రి, శ్రీధర్ రెడ్డి, సునితా బాయి, ఫర్వీన్‌బాను, ప్రసాద్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, ఆరు మండలాల మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులతో పాటు జిల్లా అధికారులు ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ తిప్పేంద్రనాయక్, గృహ నిర్మాణశాఖ పీడీ చంద్రమౌళిరెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు. కొత్తచెరువు మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పుట్టపర్తికి వెళ్లి, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

గజమాలతో ఎమ్మెల్యే సిద్దారెడ్డికి శుభాకాంక్షలు..

కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డికి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాల వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, అభిమానులు బొకేలు, పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్, యువనేత పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డా.కడపల మోహన్‌రెడ్డి, ఏపీపీఎస్సీ సభ్యుడు డా.జీవీ సుధాకర్‌రెడ్డి, ఇంకా పలువురు నాయకులు అభిమానుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు మణికంఠనాయక్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రసాద్, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు మధుకర్‌రెడ్డి, ఆదినారాయణ, మధుసూదన్ రెడ్డి, బాబ్జాన్ పాల్గొన్నారు. అలాగే నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నల్లచెరువు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. పుష్పగుచ్ఛాలు, నోటు పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బత్తల హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు..

కదిరి మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్‌కు ఆ పార్టీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ, సీనియర్ నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి నివాసం వద్దకు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఎంపీపీ గుర్రం వనజను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు సుధను నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, సంద్ర రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు. ముదిగుబ్బలోని వైఎస్సార్‌సీపీ, ఎంపీపీ కార్యాలయాల్లో ఎంపీపీ ఆదినారాయణ, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



కదిరి: ఎమ్మెల్యే సిద్దారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న పోలీసులు



పుట్టపర్తి టౌన్: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఏపీపీఎస్సీ సభ్యుడు సుధాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

రామగిరి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి మండల నాయకులు ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, కేక్ కట్ చేసి, నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

కదిరి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కదిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన సీనియర్ల డాక్టర్లు శంకరయ్య, నాగరాజు, రమణయ్య, రామకృష్ణ, ప్రసాద్, మధుసూదన్, శ్రీనివాసులను సన్మానించారు.

గడ్డివాముకు నిప్పుపెట్టిన దుండగులు

పుట్టపర్తి టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.50 వేలు విలువ చేసే గడ్డివాము దగ్ధమైన ఘటన ఆదివారం పుట్టపర్తిలో చోటుచేసుకొంది. వివరాలు.. అప్పారాచర్ల రాజారెడ్డి పశువుల కోసం వరి కోతలు కోసి 10 ట్రాక్టర్ల వరి గడ్డిని ఇంటి బయట వేసుకున్నాడు. సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా పొగ వచ్చింది. స్థానికులతో కలిసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించే లోపు గడ్డి పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.